# ఎన్నికలకు సర్వం సిద్ధం

## పోలింగ్ కేంద్రాలకు కదిలిన ఎన్నికల సిబ్బంది

- ఈవీఎంలను అందజేసిన అధికారులు
- నియోజకవర్గంలో 3లక్షల 97వేల మంది ఓటర్లు
- 405 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు
- పోలీసుల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు



పటాన్‌చెరు : రుద్రారంలో ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది

పటాన్‌చెరు, నవంబర్ 29 : పోలింగ్ కోసం ఎన్నికల సిబ్బంది కదిలింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో శాసన సభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. మండలంలోని రుద్రారంలో గీతం డీమ్డ్ యూనివర్సిటీ పాత క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన పటాన్‌చెరు నియోజకవర్గ ఎన్నికల అధికారులు హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 405 బూత్‌లు ఏర్పాటు చేశారు. 405మంది పీవోలు, 405 మంది ఏపీవోలు, 810మంది ఓపీవోలు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి అదనంగా మరో పదిశాతం మంది ఉద్యోగులను విధుల్లో నియమించామని ఆర్వో దేవుజా తెలిపారు. దాదాపు 3.97,297లక్షల మంది ఓటర్లు ఓటు వేయనున్నారని అధికారులు తెలిపారు. 38రూట్లలో 80 బస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్ని బూత్‌ల కు ఈవీఎంలను అందజేశారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్‌బూత్‌లకు ఈవీఎంలతో పాటు బస్సుల్లో బయలు దేరారు. గీతం యూనివర్సిటీలోనే స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు తరలిస్తారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక నజర్ పెట్టారు.

ఎన్నికల సంఘం కూడా వీడియో రికార్డింగ్ పెట్టింది. ఎక్కడ ఎలాంటి సంఘటన జరిగిన దానిని వీడియో తీసి సమీక్షించే ఏర్పాటు చేశారు. పోలీంగ్ స్టేషన్ల బయట 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రాత్రి వేళల్లోను పోలీసు పికటింగ్ కొనసాగుతున్నది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పోలీసు అధికారులు తెలిపారు.

**ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి**

జిన్నారం, నవంబర్ 29 : జిన్నారం మండలంలోని పదిహేను గ్రామ పంచాయతీలు, బొల్లారం మున్సిపాలిటీలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల పరిశీలకులు, తహసీల్దార్ రవికుమార్ బుధవారం తెలిపారు. జిన్నారం మండలంలో 25 పోలింగ్ కేంద్రాలు, బొల్లారంలో 33 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బందికి ఇన్‌చార్జిలు పలు సలహాలు సూచనలు చేశారు.

**పారిశ్రామిక వాడలో పోలింగ్ కు సర్వం సిద్ధం**

బొల్లారం, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికలకు బొల్లారం మున్సిపాలిటీలోని పోలింగ్ కేంద్రాల్లో సర్వం సిద్ధమైంది. పోలింగ్ కోసం 33 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. ముగ్గురు సెక్టోరల్ అధికారులు పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో సిబ్బంది చేరుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఓ లతో పాటు ఆరోగ్య సహాయం అందించేందుకు అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉంటారని తెలిపారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు సెక్టోరల్ అధికారులు రవీందర్‌రెడ్డి, దీలిప్, సురేశ్, కమిషనర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షించారు.

**ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి..**

రామచంద్రాపురం, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం పోలింగ్‌కు ఏర్పాట్లను పూర్తి చేసింది. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్‌లతో పాటు తెల్లాపూర్ మున్సిపాలిటీలో 106 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. పోలింగ్ ఏర్పాట్లను తహసీల్దార్ సంగ్రంరెడ్డి పర్యవేక్షణ చేస్తున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేసేందుకు ఓటరు కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డుని తీసుకొని పోలింగ్ కేంద్రానికి వెళ్లవచ్చని తెలిపారు. ఇప్పటికే ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎన్నికల విధులకు హాజరైన పోలీసులు



బొల్లారం : పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బందితో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ సంగారెడ్డి





ఆర్సీపురంలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



జిన్నారం పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ఏజెంట్లకు సూచనలు చేస్తున్న ఇన్‌చార్జి శ్రీనివాస్



రామచంద్రాపురం : రుద్రారం నుంచి ఆర్సీపురం కేంద్రానికి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



పటాన్‌చెరు : ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన బూత్‌లకు వెళ్తున్న సిబ్బంది



జిన్నారం : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## నేడు అసెంబ్లీ పోలింగ్

గుమ్మడిదల, నవంబర్ 29 : రాష్ట్ర వ్యాప్తంగా గురువారం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఎన్నికలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం పార్టీల అభ్యర్థులు పోటీలో ఉండగా వీరితో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరికి గురువారం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికలు ఓటింగ్ జరుగుతుందని అధికారులు తెలిపారు. ఇందులో భాగం గా గుమ్మడిదల మండలంలో ఉన్న 13 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలను నిర్వహించడా నికి ఎన్నికల అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. కాగా ఓటు వేయాడాకి వచ్చే ఓటర్లు తమ ఓటరు స్లిప్‌తో పాటు ఏదైన ప్రభుత్వంచే గుర్తింపు పొందిన 12రకాల గుర్తింపు కార్డులో ఏ ఒక్కటి ఉన్నా ఓటు వేసి సౌకర్యం ఉందని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

**గుర్తింపు కార్డులివే..**

1. ఆధార్‌కార్డు, 2. గ్రామీణ ఉపాధిహామీ స్కీమ్ గుర్తింపు కార్డు 3. ఫొటోతో కూడిన బ్యాంకు లేదా పోస్టాఫీస్ పాస్‌బుక్ 4. కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు 5. డ్రైవింగ్ లైసెన్సు, 6. పాన్ (ఆధాయ పన్ను శాఖ జారి చేసిన) కార్డు 7. నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ ప్రకారం రిజిస్టర్ జనరల్ జారీ చేసిన స్మార్ట్‌కార్డు 8. పాస్‌పోర్ట్, 9. ఫొటోతో కూడిన పెన్షన్‌కార్డు 10. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వరంగ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన సర్వీస్ ఐడీ కార్డులు 11. ఎంపీ, ఎమ్మెల్యేలకు అధికారికంగా జారీ చేసిన ఐడీ కార్డులు 12. కేంద్ర సోషల్ జస్టిస్ మంత్రిత్వశాఖ జారీ చేసిన యూనిక్ డీజేబిలిటీ కార్డులు. ఇందులో ఏ ఒక్కటి ఉన్నా ఓటు వెసేందుకు సౌకర్యం ఉంటుందని అధికారులు తెలిపారు.